రంజాన్ వేళలు

	ఇఫ్తార్(శుక్రవారం)	సహెర్(శనివారం)
కర్నూలు	6:34 (సాయంత్రం)	4:58 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:31 (సాయంత్రం)	5:10 (ఉదయం)
ఆదోని	6:36 (సాయంత్రం)	4:59 (ఉదయం)

> ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటే తీవ్ర చర్యలు ఉంటాయి. రాజకీయ పార్టీలకు అనుకూలంగా నేరుగా ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.
> - రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్


ఎమ్మిగనూరు పట్టణంలో వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకతో కలిసి ప్రచారంలో పాల్గొన్న 29వ వార్డు వలంటీరు నరసింహులు



వలంటీర్లూ.. జాగ్రత్త..!

- ఎన్నికల ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు
- కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా వర్తింపు
- ఇప్పటికే పలువురిపై చర్యలు

కర్నూలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి):

వలంటీర్లు వైసీపీ కార్యకర్తలే అని పాలక పార్టీ పెద్దలు పదేపదే చెబుతున్నారు. వారిని కట్టడి చేయాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా చర్యలు చేపట్టారు. జిల్లాలో పలువురు వలంటీర్లపై సస్పెన్షన్ వేటు వేశారు. వలంటీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ఓటు వేయాలని నేరుగా ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం కల్లూరు మండలం పుసులూరులో ఇద్దరు వలంటీర్లపై కొరడా ఝుళిపించారు.



కర్నూలు జిల్లాలో 25 మండలాలు సహా కర్నూలు నగరపాలక సంస్థ, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. గ్రామీణ మండలాలలో 6,942 మంది వలంటీర్లు ఉన్నారు. కర్నూలు కార్పొరేషన్‌లోని 137 సచివాలయాల పరిధిలో 2,171, ఆదోని మున్సిపాలిటీలో 643, ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 430, గూడూరు నగర పంచాయతీ పరిధిలో 97 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. 2019 మేలో కొలువుదీరిన సీఎం జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇంటికి చేరవేయాలనే లక్ష్యంగా వీరిని నియమించింది. ప్రతి వలంటీరు వద్ద 50 ఇళ్లకు చెందిన పూర్తి సమాచారం ఉంది. దీంతో ఎన్నికల్లో వలంటీర్లను ఉపయోగించుకోవాలని అధికార వైసీపీ ముఖ్య నాయకులు ఎత్తులు వేశారు. అందుకు అనుగుణంగానే వలంటీర్లు వైసీపీ కార్యకర్తలు అంటూ సీఎం జగన్ సహా వైసీపీ ముఖ్య నాయకులు వ్యూహాత్మకంగా ప్రచారం చేస్తూ వచ్చారు. సన్మానాలు, అవార్డుల పేరిట అధికారికంగానే ప్రలోభాలు పెట్టారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతేకాదు.. ఎన్నికల షెడ్యూల్ రాకముందే వలంటీర్లకు వైసీపీ అభ్యర్థులు వివిధ గిఫ్టులు ఇచ్చి తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేశారు.

కేసులు నమోదైతే ఇబ్బందులే..

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 10,283 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. వీరిలో సగానికి పైగా డిగ్రీ, బీటెక్ ఆపై విద్యార్హత కలిగిన వారు ఉన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న వలంటీర్లు అధికార వైసీపీ నేతల ఒత్తిళ్లు, ఇతర కారణాలతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అనుకూలంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని సమస్యలు తెచ్చుకోవద్దని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. నాయకులు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే సస్పెండ్ చేస్తామని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా చెబుతున్నారు. ఎన్నికల నిబంధనల అతిక్రమణ కేసులు నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాధించినా ఇబ్బందులు పడాల్సి వస్తుందని సీనియర్ న్యాయవాదులు హెచ్చరిస్తున్నారు.


కల్లూరు మండలం పుసులూరు గ్రామంలో వలంటీర్లను సస్పెండ్ చేస్తూ ఎంపీడీవో ఇచ్చిన ఉత్తర్వులు


ఎమ్మిగనూరులో వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకతోపాటు ఎన్నికల ప్రచారంలో 33వ వార్డు వలంటీర్ ఆసీఫ్


వైసీపీ నాయకులతో కలిసి సిద్ధం పోస్టర్లు విడుదల చేస్తున్న హెచ్.కైరవాడి పీఏసీసీఎస్ అటెండరు హనుమంతు

జిల్లాలో పలువురు వలంటీర్లపై చర్యలు

- కల్లూరు మండలం పుసులూరు గ్రామానికి చెందిన క్లస్టర్-5 వలంటీరు అల్లాల ఆనంద్ (జి.ఆనంద్), క్లస్టర్-6 వలంటీరు టి.సోమన్నలు ఈ నెల 18న నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల కంప్లైంట్ సెల్‌కు ఫిర్యాదు అందడంతో అధికారులు విచారణ చేశారు. వాస్తవమని తేలడంతో వారిని సస్పెండ్ చేస్తూ కల్లూరు ఎంపీడీవో జీవీ రమణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.
- ఎమ్మిగనూరు పట్టణం 29వ వార్డులో వలంటీరు నరసిహులు, 33వ వార్డులో వలంటీరు ఆసీఫ్ వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకతో కలిసి ఆయా వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఫిర్యాదులు రావడంతో విచారించిన జిల్లా ఎన్నికల అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.
- గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి సింగిల్ విండో సొసైటీ (పీఏసీసీఎస్)లో అటెండరుగా పని చేస్తున్న హనుమంతు వైసీపీ నాయకులతో కలిసి సిద్ధం పోస్టర్లు విడుదల చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫిర్యాదు రావడంతో విచారించిన అధికారులు సస్పెండ్ చేశారు.
- గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామంలో నిర్వహించిన వైసీపీ ప్రచార కార్యక్రమంలో వలంటీర్లు బాలకృష్ణారెడ్డి, బాకరబీ, పి.అపర్ణ, కామాక్షి, పుష్పావతి, లక్ష్మన్న, మద్దిలేటిలు పాల్గొన్నారు. దీంతో వీరిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జి.సృజన ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. ఒకే గ్రామంలో ఏడుగురు వలంటీర్లను సస్పెండ్ చేయడం రాష్ట్రంలోనే ప్రథమమని తెలుస్తోంది.
- కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయం-127లో కొత్తపేట-1 వలంటీరు మనోజ్‌కుమార్ రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన భోజనానికి హాజరయ్యారనే ఫిర్యాదు రావండంతో విచారించిన అధికారులు సస్పెండ్ చేశారు.
- ఆదోని పట్టణంలో ఓ వలంటీరు వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారనే ఫిర్యాదు రావడంతో అధికారులు విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.


గోనెగండ్ల మండలం వేముగోడులో వైసీపీ నాయకులతో కలిసి సిద్ధం పోస్టర్లు విడుదల చేస్తున్న వలంటీర్లు (ఫైల్)

ఎన్నికల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

- కలెక్టర్ జి. సృజన


మాట్లాడుతున్న కలెక్టర్ డా.జి.సృజన

మంత్రాలయం, మార్చి 21: మంత్రాలయం నియోజకవర్గంలో ఎన్నికల విధులపట్ల నిర్లక్ష్యం వహించకుండా అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డా.జి. సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ అధికారులకు సూచించారు. గురువారం టీటీడీ కళ్యాణ మండపంలో మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళి, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గం బీఎల్వోలు, రూట్ అధికారులు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రంలో ఆరుగురు సిబ్బంది పని చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. 30 రూట్లు ఉన్నాయని, 24 సెక్టార్ ఆఫీసర్లు ఉన్నారని అన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో 2,06,000 మంది ఓటర్లు ఉన్నారని, అందరూ ఓటు హక్కును వినియోగించుకునేలా బీఎల్వోలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ఫర్నీచర్, మరుగుదొడ్లు వంటివి సరి చూసుకోవాలన్నారు. నేరచరిత ఉన్నవారు, ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడే వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గతంలో ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ఆ గ్రామాల్లో అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్నవారి మీద ముందస్తు బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా స్టిక్కర్లు, ఫ్లెక్సీలు ఉంటే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోసిగి సీఐ ప్రసాద్, నాలుగు మండలాల తహసీల్దార్లు, డీటీలు రాఘవేంద్ర, శశిశేఖర్‌రావు సెక్టారు ఆఫీసర్లు, బీఎల్వోలు, ఆర్ఐ ఆదాం తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు హెచ్చరిక

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 21: కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లను తొలగిస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ డా.జి. సృజన హెచ్చరించారు. గురువారం ఆర్వోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలై నాలుగు రోజులు గడిచినప్పటికీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు గురించి ఇంకా ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు మొదలైన వాటి మీద పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్లు తీసేయకపోతే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీ-విజిల్ ఫిర్యాదుల పరిష్కారంలో పాణ్యం, పత్తికొండ నియోజకవర్గాల వెనుకబడి ఉన్నాయని తెలిపారు. ఓటు నమోదుపై ర్యాలీలు, ఇంటర్వ్యూలు, ఇతర అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆర్వోలను ఆదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12 మంది వలంటీర్ల తొలగింపు

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 21: జిల్లాలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన 12 మంది వలంటీర్లను ఉద్యోగం నుంచి తొలగించామని కలెక్టర్ డా.జి.సృజన తెలిపారు. కర్నూలు నియోజకవర్గంలో ఒకరు, ఆదోని నియోజకవర్గంలో ఒకరు, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 8 మంది, పాణ్యం నియోజకవర్గంలో ఇద్దరు, మొత్తం 12 మంది వలంటీర్లను విధుల నుంచి తొలగించామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులోకి వచ్చిన నాటి నుంచి సీ-విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో అందులో పొందుపరచవచ్చని, ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడు చేయాలన్నారు. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు విచారణ చేపట్టి వంద నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లాలో సీ-విజిల్ యాప్ ద్వారా 46 ఫిర్యాదులు రాగా ఇందులో సహేతుకుంగా ఉన్న 28 ఫిర్యాదులను పరిష్కరించామని చెప్పారు. 71 శాతం ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించామని తెలిపారు.

వాము గరిష్ఠంగా రూ.33,333

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 21: కర్నూలు మార్కెట్ యార్డులో గురువారం వాము ధర ఆకాశాన్నంటింది. కర్ణాటక, తెలంగాణతోపాటు ఏపీలోని వివిధ జిల్లాల నుంచి గురువారం 763 క్వింటాళ్ల వామును రైతులు విక్రయానికి తెచ్చారు. గరిష్ఠ వాము ధర రూ.33,333, మధ్యస్థ ధర రూ.22,642 ధర పలికిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవిందు తెలిపారు. ఈ ధర గతంలో ఎప్పుడూ లేదని, తాము ఆశించలేదని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఉల్లి ధర మాత్రం రోజురోజుకు దిగజారుతుంది. క్వింటం గరిష్ఠ ధర రూ.1,351 మధ్యస్థ ధర రూ.859, కనిష్ఠ ధర మరింత దిగజారి రూ.297కు పడిపోయింది. రవాణా ఖర్చులు కూడా గిట్టుబాటు కావడం లేదనే ఆవేదనతో కొంతమంది రైతులు మార్కెట్ యార్డులోనే వదిలివెళ్లారు. ఎండు మిర్చికి గరిష్ఠ ధర రూ.16,201, మధ్యస్థ ధర రూ.13,599, కనిష్ఠ ధర రూ.1599కు అమ్ముడు పోయింది. మినుములకు గరిష్ఠంగా రూ.9,089, మధ్యస్థ ధర రూ.9,069, కనిష్ఠ ధర రూ.7,501 రైతులకు అందింది. మొక్కజొన్నకు గరిష్ఠ ధర రూ.2,124, కనిష్ఠ ధర రూ.2,124 పలికింది. కందులు క్వింటం ధర రూ.10 వేలకు పైగానే పలుకుతోందదని మార్కెటింగ్ శాఖ అధికారులే అంచనా వేశారు. కానీ క్వింటానికి గరిష్ఠ ధర రూ.9,861, మధ్యస్థ ధర రూ.9,770, కనిష్ఠ ధర రూ.2,090 మాత్రమే రైతులకు దక్కింది.

వేణుగోపాలుడి అలంకరణలో నృసింహుడు


వేణు గోపాలస్వామి అలంకారంలో జ్వాలా నరసింహ స్వామి

నంద్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జ్వాలా నరసింహ స్వామి గురువారం వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు దర్శనం చేయించారు. అనంతరం చూర్ణాభిషేకం నిర్వహించారు. ముందుగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామికి ఉత్సవం, అభిషేకం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. స్వామివారు పొన్న చెట్టు వాహనంపై రాత్రి విహరించారు.

దిగువ అహోబిలంలో..

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం ప్రహ్లాద వరద స్వామిని మోహిని అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తరువాత అభిషేకం నిర్వహించారు. రాత్రి శరభ వాహనంపై వాహనంపై విహరించారు. కాగా ఎగువ అహోబిలంలో శుక్రవారం తిరుమంజనం, గజ వాహనం, తిరు కళ్యాణోత్సవం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహిస్తారు. దిగువ అహోబిలంలో వేణుగోపాలస్వామి అలంకారం, చుర్ణాభిషేకం, అభిషేకం, రాత్రి పొన్నచెట్టు వాహనం కార్యక్రమాలను చేపడతారు.

పత్తికొండ ఎమ్మెల్యే కోడ్ ఉల్లంఘన!

- 22 మందికి సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే శ్రీదేవికి ఈసీ నోటీసులు


తన నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ, మార్చి 21: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కోడ్‌ను ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఎక్కడ చూసినా యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఏకంగా 22 మంది బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆమె పంపిణీ చేసిన ఫొటోలు వైసీపీ సోషల్ మీడియా గ్రూపులతో పాటు స్థానికంగా వాట్సాప్ గ్రూపుల్లో హల్ చల్ చేశాయి. బహిరంగంగా చెక్కులను పంపిణీ చేస్తే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిసి కూడా ఎమ్మెల్యే గోప్యంగా తన నివాసంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎమ్మెల్యే శ్రీదేవికి ఎలక్షన్ కమిషన్ నోటీసులను జారీ చేసింది. ఈ మేరకు గురువారం పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేస్తారని, నిబంధనల ఉల్లంఘనలపై 24 గంటలలోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. ఎన్నికల అధికారి రామలక్ష్మి జారీ చేసిన షోకాజ్ నోటీసును రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే శ్రీదేవికి నేరుగా అందజేశారు.

రోడ్డు మెటల్ క్యారీల సర్వేలు

కర్నూలు(అర్బన్), మార్చి 21: జిల్లాలో రెండు ప్రాంతాల్లో రోడ్డు మెటల్ క్యారీల కోసం సర్వేలు నిర్వహించామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలం బోడ్డువాని పల్లె 485 సర్వే నెంబర్, కల్లూరు మండలం చెట్ల మల్లాపురం గ్రామంలో 135 సర్వే నంబర్లలో రోడ్డు మెటల్ క్యారీల కోసం సర్వేలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం మూడు క్వారీలను ఎంపిక నిర్ధారించామని పేర్కొన్నారు. ఈ సర్వేల్లో సూపర్‌వైజర్లు పురేంధర్, దీలీప్ తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(లీగల్), మార్చి 21: కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి న్యాయవాది కె. మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 23లోగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. 25న నామినేషన్ల ఉపసంహరణ, 26న పోటీ చేసే అభ్యర్థులు తమ అభ్యర్థిత్వంపై స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులకు విన్నవించుకోవచ్చని తెలిపారు. 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, ఆ తర్వాత వెంటనే కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల సహాయకులుగా న్యాయవాదులు బి.గోపాలకృష్ణుడు, ఎస్.బాబు సాహెబ్ ఉంటారని ఆ ప్రకటనలో తెలిపారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 21: 2024-25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ డిప్లమా కోర్సుల్లో ప్రవేశం కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు మైనార్టీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులు పదో తరగతి, తత్సమాన పరీక్షలు ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు రుసుం రూ.400 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5 చివరి తేదీ అన్నారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 9949571971, 9494834320 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

మైనార్టీలకు ఉచితంగా నీట్, ఈపీ సెట్ శిక్షణ

కర్నూలు(అర్బన్), మార్చి 21: ఉస్మానియా కళాశాలలో రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆధ్వర్యంలో ఈపీ సెట్, నీట్ ఎంట్రన్స్ పరీక్షలో మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజ్మామిల్ ఒక ప్రకనటలో తెలిపారు. పరీక్షలు రాసే క్రైస్తవులు, ముస్లిం, దూదేకుల, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారసీల వంటి మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్ హాల్ టికెట్ నీట్/ఈపీసెట్ 2024 ఆన్‌లైన్ ఫామ్, ఆధార్ కార్డు, 2పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, జత చేసి ఉస్మానియా కళాశాలలోని రూమ్ నెంబర్ 54లో ఇవ్వాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9441761178, 9849896996లో సంప్రదించాలన్నారు.

గర్భిణులకు టిఫా స్కానింగ్ తప్పనిసరి: డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మార్చి 21: గర్భిణులకు టిఫా స్కానింగ్ తప్పనిసరి అని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో మూడు స్కానింగ్ కేంద్రాలను గురువారం ఉదయం తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో ఫాం-ఎఫ్ అప్‌లోడు చేస్తున్నారా..? లేదా అని ప్రశ్నించారు. గర్భిణులకు ఖరీదైన టిఫా స్కానింగ్ చేయాలని, ఆరోగ్యశ్రీ నుంచి ఉచితంగా నిర్వహించాలని స్కానింగ్ కేంద్రాలను ఆదేశించారు. ప్రతి స్కానింగ్ కేంద్రం పీసీపీఎన్‌డీ ఈ యాక్టు ప్రకారం రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

డౌన్ సిండ్రోమ్ ఓ జన్యుపరమైన సమస్య

కర్నూలు(హాస్పిటల్), మార్చి 20: పిల్లల్లో కనిపించే జన్యుపరమైన అనారోగ్య సమస్యల్లో డౌన్ సిండ్రోమ్ ఒకటని కర్నూలు డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ న్యూక్లెయర్ గ్యాలరీలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినం సందర్భంగా గురువారం ఆర్‌బీఎస్‌కే వైద్యులు, తల్లులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడారు. డౌన్ సిండ్రోమ్ పిల్లలు అందరి మాదిరిగానే పుడుతారని, కానీ ఎదిగే కొద్దీ రకరకాల సమస్యలు మొదలవుతాయని అన్నారు. పిల్లల ముఖం భిన్నంగా కనిపిస్తుందని తెలిపారు. చిన్నపిల్లల విభాగాధిపతి విజయానందబాబు మాట్లాడుతూ ఈ వ్యాధితో బాధపడే పిల్లల్లో శారీరక పెరుగుదల ఉండదని, బుద్ధిమాంద్యం, చురుకుదనం లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. గర్భిణీ దశలోనే డాక్టర్ల సలహా మేరకు వైద్యం తీసుకున్నట్లయితే జన్యుపరమైన సమస్యను నివారించవచ్చునని తెలిపారు. గర్భస్థ శిశువులు జన్యులోపాలను ముందుగానే మూయకిల్ ట్రాన్స్‌యెన్సి (ఎన్‌టీ) స్కాన్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చునని చెప్పారు. ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శైలేష్ కుమార్, కర్నూలు జీజీహెచ్ చిన్న పిల్లల విభాగం ప్రొఫెసర్లు సుహాసిని, శారద, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రకాష్‌కుమార్, శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణ, ప్రకాష్, ఆనంద్, హిమబిందు, లక్ష్మీనారాయణ, సుధాప్రియ, డైస్ చిన్న పిల్లల వైద్యులు సృజన, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ప్రొజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

సీ విజిల్ దుర్వినియోగం!



- సామాన్యుడి చేతిలో వజ్రాయుధం
- పక్కా ఆధారాలు కీలకం
- మొక్కుబడి ఫిర్యాదులతో అధికారుల ఇబ్బందులు
- జిల్లాలో 46 ఫిర్యాదులు.. 28 పరిష్కారం

కర్నూలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చింది. కోడ్ ఉల్లంఘనులపై కొరడా చర్యలు తీసుకోడానికి కేంద్ర ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్ తెచ్చింది. దీన్ని పక్కా ఆధారాలతో వినియోగిం చుకుంటే సామాన్యుల చేతిలో వజ్రాయుధంగా సి విజిల్ పని చేస్తుంది. ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లో పరిష్కారం చేస్తారు. అయితే.. కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కోడ్ అమలు చేసే అధికారులు ఇబ్బందుకుల గురౌతున్నారు. సమయం కూడా వృథా అవుతుంది. పక్కా సమాచారం.. ఆధారాలతో ఉపయోగించుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు.

పార్లమెంట్ సహా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఈ నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు జారీ చేసింది. అదే రోజు నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చింది. 24 గంటల్లో ప్రభుత్వ అధికారుల కార్యాలయాలు, ఆవరణల్లో, 48 గంటల వ్యవధిలో ఆర్టీసీ బస్టాండులు, రోడ్డు వైపు, పార్కులు, రైల్వే స్టేషన్లు.. వంటి పబ్లిక్ స్థలాల్లో, 72 గంటల్లో ప్రైవేటు స్థలాల్లో ఉన్న ఉన్న రాజకీయ పార్టీలు, నాయకులు ఫ్లెక్సీలు, ఫొటోలు, పోస్టర్లు, హోర్డింగ్స్ సహా ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్లను తొలగించామని అధికారులు పేర్కొన్నారు. గురువారం వరకు ప్రభుత్వ, పబ్లిక్ స్థలాల్లో 15,115, ప్రైవేటు స్థలాల్లో 5,647 గోడ రాతలు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, హోర్డింగ్స్ తొలగించారు. అదే క్రమంలో సి విజిల్ యాప్‌లో 46 ఫిర్యాదులు రాగా.. 28 ఫిర్యాదులను విచారించి నిజమని తేలడంతో శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. మరో 18 ఫిర్యాదులకు ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు వివరించారు.

సీ విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం

నియోజకవర్గం	ఫిర్యాదులు	పరిష్కారం	100 నిమిషాల్లో పరిష్కారమైనవి	శాతం
ఆదోని	3	1	1	100
ఆలూరు	2	1	--	--
కోడుమూరు(ఎస్సీ)	4	--	--	--
కర్నూలు	19	17	17	100
మంత్రాలయం	1	--	--	--
పాణ్యం	9	5	1	20
పత్తికొండ	8	4	1	25
ఎమ్మిగనూరు	--	--	--	--
మొత్తం	46	28	20	71

సరైన ఆధారాలతో వినియోగించుకోవాలి

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత సి విజిల్ ద్వారా 48 ఫిర్యాదులు వచ్చాయి. తక్షణమే ఎఫ్ఎస్‌టీలను పంపించి విచారణ చేయించి 100 నిమిషాల్లో పరిష్కరించాం. ఆధారాలు, పక్కా సమాచారంతో వచ్చిన 28 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నాం. మరో 16 ఫిర్యాదులకు ఎలాంటి ఆధారాలు లేవు. కొందరు సీ విజిల్ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల సమయం వృథా అవుతున్నది.

-జి. నాసరరెడ్డి, ఎంసీసీ కో-ఆర్డినేటర్, జడ్పీ సీఈఓ, కర్నూలు

● సీవిజిల్ దుర్వినిగం చేయవద్దు!

కర్నూలు నగరం సంకల్బాగ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సి విజిల్‌లో ఓ ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఎంసీసీ అధికారులు సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి పూర్తి వివరాలు చెప్పాలని కోరగా.. అధికారులు పని చేస్తారో లేదో తెలుసుకుందామని అప్‌లోడ్ చేశాను..! అని సమాధానం రావడంతో అధికారులు అవాక్కయ్యారు. ఆ వెంటనే సదరు వ్యక్తి తన ఫిర్యాదును సీ విజిల్‌లో డిలిట్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వజ్రాయుధం లాంటి సీ విజిల్ సామాన్యుల చేతికి ఇస్తే.. దురుద్దేశం వల్ల, ఆకతాయితనం వల్ల దుర్వినియోగం కూడా అవుతున్నది. దీని వల్ల అధికారుల సమయం వృథా అవుతుంది. సి విజిల్‌లో ఫిర్యాదు రాగానే జిల్లా కోడ్ ఆఫ్ కాండక్ట్ (డీసీసీ) నుంచి ఎఫ్ఎస్‌టీకి 5 నిమిషాల్లో వెళ్తుంది. ఆ టీం 15 నిమిషాల్లో సంబంధిత ప్రదేశానికి చేరుకోవాలి. 30 నిమిషాల్లో విచారించి ఆ నివేదికను కలెక్టరుకు పంపాలి. 50 నిమిషాల్లో కలెక్టరు ఆ నివేదికపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇంత వేగంగా పని చేయాల్సిన ఈ సమయంలో ఆధారాలు, వివరాలు లేని ఫిర్యాదులు చేయడం వల్ల డీసీసీ నుంచి ఎఫ్ఎస్‌టీ వరకు సమయం వృథా చేయడమే అవుతుంది.

జగన్ జైలుకెళ్లడం ఖాయం

- వైసీపీ కథ ముగిసింది
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, మార్చి 21: రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని, జగన్ జైలుకు వెళ్ళడం తథ్యమని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ జగన్ పని అయిపోయిందని, వైసీపీ నాయకులంతా కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనపై అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారన్నారు. జగన్ పార్టీని ఓడించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. అప్పులు, అవినీతి, అరాచక, మద్యం, జూదం, గంజాయి తదితర సంఘ విద్రోహాలకు నిలయంగా ఏపీని సీఎం జగన్ మార్చేశాడని అన్నారు. భూ దందాలు, రేషన్ మాఫియా, ఎర్రచందనం స్మగ్లింగ్, మైనింగ్ దోపిడీతో వైసీపీ ముఠాలు వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నారని విమర్శించారు. వివేకా హత్య కేసు వ్యవహారంలో జగన్ ప్రతిష్ట, పరువు అథఃపాతాళానికి చేరాయన్నారు. వైఎస్సార్ ఆశయాన్ని నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ ఆశీర్వదించాలని, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బోయ రమణ, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, శ్రీరాములు పాల్గన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

లింక్ ఓపెన్ చేయగానే రూ.50 వేలు మాయం

వలంటీర్ అకౌంట్ నుంచి లాగేసిన సైబర్ నేరగాళ్లు

హొళగుంద, మార్చి 21: సైబర్ మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా కేటుగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో జనం డబ్బులు దోచుకుంటున్నారు. అలాంటి సంఘటనే హొళగుందలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన బోయ కరిభేష్, ఏడో వార్డుకు వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి వలంటీర్ గ్రూపులో గుర్తు తెలియని వ్యక్తి సీఎస్సీ సర్వీస్ జాయిన్ యాప్ లింక్ పెట్టాడు. దీంతో వలంటీర్ తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేశాడు. అంతే.... ఐదు క్షణాల్లో యాప్ మాయమైపోయింది. అది కనిపించకపోవడంతో ఫోన్ పక్కన పెట్టేశాడు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో మొబైల్‌కు మెసేజ్‌లు రావడంతో వాటిని చూసిన వలంటీర్ ఖంగుతిన్నాడు. తన ఎస్‌బీఐ అకౌంట్ నుంచి ఐదు రూ.5వేలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.25 వేలు, ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.20వేలు విత్ డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో గగ్గోలు పెడుతున్నాడు. మోసపోయానని గుర్తించిన వలంటీర్ వెంటనే బ్యాంకు సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఫోన్‌లోని సిమ్‌కార్డు తొలగించాలని, సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారని తెలిసింది.



హొళగుందలో సైబర్ నేరగాళ్లు ఫోన్‌కు పంపిన లింక్‌ను చూపుతున్న వలంటీర్ కరిబేష్

'చెరుకులపాడులోకి అనుమతించండి..'

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 21: వెల్దుర్తి మండలం చెరుకులపాడుకు చెందిన 30 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గ్రామంలోకి అనుమతించాలని టీడీపీ జనరల్ సెక్రటరీ ఎల్‌వీ ప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకులపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు పి.రామాంజనేయులు, బి.రామాంజనేయులు, ఎం.పెద్దయ్య, కె.రామక్రిష్ణ, చాకలి సుబ్బారావుల కుటుంబాలకు చెందిన 30 మందిని ఎమ్మెల్యే శ్రీదేవి గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. అలాగే గత ఎన్నికల్లో దొంగ ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయని, చెరుకులపాడులో టీడీపీకి చెందిన పోలింగ్ ఏజెంట్లు లేకపోతే మళ్లీ దొంగ ఓట్లు పడే అవకాశం ఉందని తెలిపారు.

ఫార్మసీ ఆఫీసర్ల జిల్లా సమావేశం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 21: వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న ఉమ్మడి జిల్లా ఫార్మసీ ఆఫీసర్ల కార్యవర్గ సమావేశం గురువారం రాత్రి డీఎంహెచ్‌వో ఆవరణలో జరిగింది. సమావేశానికి ఏపీ ఫార్మసీ ఆఫీసర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగస్వామి అధ్యక్షత వహించారు. గ్రేడ్-2 ఫార్మసిస్టును ఫార్మసీ ఆఫీసర్‌గా, గ్రేడ్-1 ఫార్మాసిస్టును సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా, ఫార్మసీ సూపర్‌వైజర్‌ను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా మార్చినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజేష్ నాయక్, నాయకులు సత్యప్రసాద్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, వై.ప్రసాద్‌రావు, జేసీ తిమ్మప్ప, వీరాంజనేయులు, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం : కలెక్టర్

ఆదోని, మార్చి 21: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధం లాంటిదని కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. అలాంటి ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం ఆదోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి భీమాస్ సర్కిల్ వరకు స్వీప్ పేరుతో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రజలందరి బాధ్యత అన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ మే 13వ తేదీన ఎన్నికలు జరుగతాయన్నారు. ఓటర్లకు పూర్తి స్థాయిలో భరోసా ఇచ్చేందుకు పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఎస్పీ శివనారాయణ స్వామి, తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కోట్ల దూకుడు

- డోన్ నుంచి మొదటిసారి బరిలో..
- వ్యూహాత్మకంగా అడుగులు
- టీడీపీ గూటికి వైసీపీ నాయకులు
- అధికార పార్టీలో అలజడి



ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కోట్ల కుటుంబానిది ప్రత్యేక ముద్ర. ఎన్నో రాజకీయ సమీకరణల మధ్య కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అసెంబ్లీ బరిలో దిగారు. తన పేరును ప్రకటించినప్పటి నుంచి కోట్ల దూకుడు పెంచారు. డోన్ నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన శైలితో పట్టు బిగిస్తున్నాడు. టీడీపీ మరింత బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి జంపయ్యారు. ఈ పరిణామాలు డోన్ నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో అలజడి సృష్టిస్తున్నాయి.

డోన్, మార్చి 21: ఉమ్మడి కర్నూలు జిల్లా రాజకీయాల్లో కోట్ల కుటుంబానికి ఎంతో చరిత్ర ఉంది. దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండు సార్లు ముఖ్యమంత్రిగా, పలుమార్లు కేంద్ర మంత్రిగా పని చేశారు. ఆయన తనయుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మూడు సార్లు కర్నూలు ఎంపీగా పని చేశారు. 2012 సంవత్సరంలో కేంద్రంలో రైల్వే శాఖ సహాయ మంత్రిగా కూడా ఆయన పని చేశారు. అయితే ఊహించని రాజకీయ పరిణామాలతో కోట్ల కుటుం బం డోన్ నియోజకవర్గ రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సి వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు తీసుకున్న అనూహ్య నిర్ణయాల నడుమ డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించారు.



డోన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల నివేదిత



ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

విస్తృతంగా పర్యటనలు

కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దూకుడు పెంచారు. తన పేరును ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కోట్ల ప్రజలను కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. టీడీపీ మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రజల్లో తనదైన ముద్రను వేసుకుంటున్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీని మరింత బలపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండటంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారిపోయాయి.

●కోట్ల వేగం పెంచడంతో డోన్ నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో అలజడి కలుగుతోంది. . వైసీపీలో అసంతృప్తిగా ఉన్న పలువురు నేతలు ఇప్పటికే టీడీపీ గూటికి చేరారు. సీనియర్ వైసీపీ నాయకులు, సీనియర్ న్యాయవాది భాస్కర్ నాయుడు, వెంకటనాయునిపల్లి సర్పంచ్ సీలం చంద్రశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, ప్యాపిలి మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకటరెడ్డి, ఎర్రగుంట్లపల్లి రమేష్‌రెడ్డితో పాటు వందల మంది కార్యకర్తలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ మద్దతుదారుడుగా ఉన్న మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు కోట్లకు తన మద్దతును ప్రకటించారు. వైసీపీలో ఉన్న పలువురు అసంతృప్తి నాయకులు కోట్ల కుటుంబంతో మంతనాలు జరుపుతున్నారు. పలువురు టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయోనని నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో కలవరం పుట్టిస్తోంది.

● వైసీపీలో అలజడి

కోట్ల వేగం పెంచడంతో డోన్ నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో రేపుతోంది. వైసీపీలో అసంతృప్తిగా ఉన్న పలువురు నేతలు ఇప్పటికే టీడీపీ గూటికి చేరారు. సీనియర్ వైసీపీ నాయకులు, సీనియర్ న్యాయవాది భాస్కర్ నాయుడు, వెంకటనాయునిపల్లి సర్పంచ్ సీలం చంద్రశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, ప్యాపిలి మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకటరెడ్డి, ఎర్రగుంట్లపల్లి రమేష్‌రెడ్డితో పాటు వందల మంది కార్యకర్తలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ మద్దతుదారుడుగా ఉన్న మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు కోట్లకు తన మద్దతును ప్రకటించారు. వైసీపీలో ఉన్న పలువురు అసంతృప్తి నాయకులు కోట్ల కుటుంబంతో మంతనాలు జరుపుతున్నారు. పలువురు టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయోనని నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో కలవరం పుట్టిస్తోంది.



ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్వో శేషిరెడ్డి

గూడూరు, మార్చి 21: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోడుమూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ ఎం శేషిరెడ్డి అన్నారు. గురువారం గూడూరులోని ఎస్ఎస్వీ కళాశాలలో నీ ఓటు నీ భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా విదార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ గూడూరులో గతంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదైన 176, 179 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, అక్కడ పరిశీలించి ఓటర్లతో సమావేశం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆర్వో ఉదయ్ సంతోష్, డిప్యూటీ తహసీల్దార్ శారద, ఆర్ఐ వరలక్ష్మీ, ఏఎస్వో పద్మజ, కంపూటర్ ఆపరేటర్ హనుమంతు పాల్గొన్నారు.

కల్లూరు: ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పాణ్యం నియోజకవర్గం ఆర్వో, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు మండలం షరీన్‌నగర్‌లోని 14,15 పోలింగ్ కేంద్రాలను ఆర్వో పరిశీలించారు. అనంతరం స్వీప్ కార్యక్రమంలో భాగంగా షరీన్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి జెండాబడి వరకు ఓటర్ల అవగాహన ర్యాలీలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పాల్గొన్నారు. ఓటు ప్రాముఖ్యతను ఓటర్లకు వివరించారు. కల్లూరు తహ సీల్దారు మునివేలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మహాశక్తి పథకం మహిళలకు వరం

టీడీపీ నాయకురాలు బైరెడ్డి శబరి


కన్నమడకలలో నాయకులతో మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, మార్చి 21: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన మహాశక్తి పథకం మహిళలకు వరం లాంటిదని టీడీపీ నాయకురాలు బైరెడ్డి శబరి అన్నారు. గురువారం మండలంలోని కన్నమడకల గ్రామంలో బైరెడ్డి శబరి గ్రామంలో పర్యటించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బైరెడ్డి శబరి మాట్లాడుతూ మహిళలకు టీడీపీ అధికారంలోకి వస్తే ఎన్నో ప్రయోజ నాలు ఉన్నాయన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా సీఎం జగన్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్ రెడ్డికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయకులు సుబ్బరాయుడు, కురువ జయన్న, రామక్రిష్ణ, పాణ్యం పుల్లారెడ్డి, బోయ శ్రీరాములు, వందనాలు, నాగ రాజు, గ్రామ నాయకులు పద్మనాభం, మహిళలు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి: దస్తగిరి

గూడూరు, మార్చి 5: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం గూడూరు మండలంలోని జులకల్ గ్రామంలో బొగ్గుల దస్తగిరి ప్రచారంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకలను వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎం కావడం తథ్యమన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, వైసీపీని ఇంటికి పంపడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ రామాంజనేయులు, సర్పంచ్ విద్యావతి, మాజీ మండల టీడీపీ కన్వీనర్ జె సురేష్, రేమట వెంకటేష్, సృజన్, పౌలు, కౌన్సిలర్లు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, తెలుగు శ్రీనివాసులు, దమోదర్ రెడ్డి, దేవారెడ్డి పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ డిప్యుటేషన్ రద్దు

కర్నూలు(హాస్పిటల్), మార్చి 21: జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న లద్దగిరి పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ షఫి డిప్యుటేషన్‌ను రద్దు చేసి రిలీవ్ చేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఈ2 సెక్షన్‌కు ఇటీవల పదోన్నతిపై వచ్చిన మణిమోహన్‌కు కేటాయించినట్లు తెలిపారు ఇటీవల లద్దగిరి పీహెచ్‌సీ తనిఖీకి వెళ్లినప్పుడు అక్కడ ఉద్యోగులకు, సిబ్బందికి వేతనాలు రాలేని పరిస్థితి నెలకొందని, అక్కడ ఓ ఉద్యోగికి 5 నెలలుగా వేతనాలు అందని పరిస్థితి నెలకొందని చెప్పా రు. లద్దగిరి పీహెచ్‌సీ చాలా పెద్దదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అక్కడకి క్లర్క్‌ను పంపించినట్లు వెల్లడించారు.

పుల్లారెడ్డి కళాశాలలో రక్తదాన శిబిరం

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 21: స్థానిక పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గురువారం ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 81 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులను కళాశాల యజమాన్యం అభినందించింది.

టీడీపీలో చేరిక


గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరిన ఎల్కె తండా వాసులు

కల్లూరు, మార్చి 21: గడివేముల మండలం ఎల్కే తండాకు చెందిన పలువురు నాయకులు గౌరు దంపతుల సమక్షంలో టీడీపీలో చేరారు. గురువారం పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జే.రాజునాయక్, రంగస్వామినాయక్ ఆధ్వర్యంలో కాట్రా వత్‌కేశాలు, కాట్రావత్‌రాజేష్, బిలావత్ బాలాజీ, కర్ణతొడ్ తిరుపాల్, హోనా నాయక్, దేనానాయక్ ఉన్నారు.

టీడీపీ కూటమి గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

శంఖారావంలో గౌరు దంపతులు

కల్లూరు, మార్చి 21: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం 19వ వార్డు పార్థసారధినగర్, జంపాల అపార్ట్‌మెంట్, గణేష్‌నగర్, బృందావన్‌గనర్, టైపిస్ట్‌కాలనీలతో ఆమె ప్రజల సమస్యలను తెలుసుకుని శంఖారావం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతిపాలు చేశారని, రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మిగిలిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకహోదా, పోలవరం, ప్రత్యేక రైల్వే జోన్, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, జాబ్‌క్యాలెండర్, మద్య నియంత్రణ గాలికొదిలేసి రాష్ట్రంలో మైన్స్, వైన్స్, శాండ్, భూఆక్రమణలతో వైసీపీ నాయకులు చెలరేగిపోతున్నారని ఆరోపిం చారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, వంగాల జనార్ధన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ న్యాయవాది నాగముని, రాయల సీమ విద్యార్థి విభాగం జేఏసి చైర్మన్ శ్రీరాములు, అయ్యస్వామి, సాయి విజయ్, రమేష్, జగదీస్, జనసేన నాయకులు మంజునాథ్, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

● **వైసీపీని గద్దెదించుదాం:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని గద్దెదించి టీడీపీ కూటమిని గెలిపించుకుందామని పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తమ స్వగృహంలో కల్లూరు, ఓర్వకల్లు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా నారా దేవాన్ష్ పుట్టిన రోజును పురస్కరించుకుని గౌరు దంపతులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలను ఎక్కడికక్కడ అడ్డుకోవాలని సి.విజిల్ యాప్‌ద్వారా ఫిర్యాదులు అందించాలని కోరారు. కార్యక్ర మంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చింతా సురేష్ బీజేపీ ఉపాధ్యక్షుడు తారకేశ్వరరెడ్డి, కల్లూరు, ఓర్వకల్లు మండల టీడీపీ అధ్యక్షులు డి.రామాంజనేయులు, గోవిందరెడ్డి పాల్గొన్నారు.


సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తున్న గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి

టీడీపీలోకి చనుగొండ్ల వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 21: గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, జడ్పీహైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ చిన్న రంగయ్య, ఎంపీయూపీ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బి.సుధాకర్ వైసీపీకి గుడ్‌బై చెప్పారు. గురువారం వారు కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కోడుమూరు అభ్యర్థి బొగ్గుల దస్తగిరి సమక్షంలో పార్టీలో చేరారు. ఈసందర్భంగా విష్ణు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో చనుగొండ్ల వాసులు జయన్న, సోమేష్, పుల్లన్న, వీరేష్, మోహన్, పెద్దయ్యగౌడ్, పెద్దరంగయ్య, ఎర్రన్న, గోపాల్, పవన్, సీమోన్, రఘు, మేకల రాముడు, టైలర్ ఎర్రన్న, గిడ్డయ్య ఉన్నారు. గూడురు మండల టీడీపీ మాజీ కన్వీనర్ జె.సురేష్, పోలకల్ అమర్ పాల్గొన్నారు.

● సి.బెళగల్ మండలం చింతమానుపల్లె గ్రామానికి చెందిన వైసీపీ యువనాయకులు, కార్యకర్తలు మండల టీడీపీ నాయకులు బోయ తిమ్మప్ప, పోలకల్ అమర్ ఆధ్వర్యంలో దాదాపు 30మంది టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి రంగన్న, సుధాకర్, మహేష్, విష్ణు, వెంకటేష్, శ్యామ్‌రాజు, క్రిష్ణ, మల్లేష్, శేఖర్, వీరేష్, సోమేష్ టీడీపీలో చేరారు.

● సి.బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఎనిమిది మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో సద్దాం, ఫక్రుద్దీన్, బాషా, విశ్వ, నప్పీర్, నాసిర్, వీరేష్, భాస్కర్ ఉన్నారు.

● కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రజానగర్‌కు చెందిన వైసీపీ పదో వార్డు సభ్యుడు రమణయ్య ఎంపీటీసీ కురువ మద్దిలేటి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వైసీపీ నుంచి మద్దిలేటి, ఉశేన య్య, సురేష్, నాగేంద్ర, మహేష్, ప్రభుదాస్, ప్రకాష్, శేషమ్మ, చిట్టెమ్మ, బజా రమ్మ, మహాదేవి టీడీపీలో చేరారు.

● కర్నూలు రూరల్ మండలం భూపాల్‌నగర్, మిలటరీ కాలనీకి చెందిన కొంతమంది టీడీపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, బొగ్గుల దస్తగిరిని కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు.


టీడీపీలో చేరిన వారితో విష్ణు, దస్తగిరి

రంగులు తప్ప.. అభివృద్ధి శూన్యం

8వ వార్డులో టీజీ భరత్ భరోసా యాత్ర


భరోసాయాత్రలో పాల్గొన్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 21: కర్నూలు నియోజకవర్గంలో పైపైన రంగులు తప్ప నిజమైన అభివృద్ధి జరగలేదని టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని 8వ వార్డులో టీజీ భరత్ భరోసా యాత్ర నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఈసందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ వార్డుల్లోని ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే మరోవైపు నగరాన్ని స్మార్ట్ సిటీ చేశామని వైసీపీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. కోట్లాది రూపాయాలు ఖర్చు చేశామని చెబుతున్నప్పటికీ వీధుల్లో సమస్యలు మాత్రం తీరలేదన్నారు. ఆరు గ్యారెంటీలతో కర్నూలు కోసం తాను తీసుకొచ్చిన మేనిఫెస్టోతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పరమేశ్ అశోక్, కస్తూరి వెంక టేశ్వర్లు, నాగార్జున శేషఫణి, శేషన్న, హరి, హరికృష్ణ, శ్రీకాంత్, సలాం, జుబేర్, శ్రీదర్, శ్రీకాంత్, ఎజాజ్ బాషా, రేణుక, సువర్ణ, నాగార్జున క్రిష్ణ, ఇర్ఫాన్, మంగ రమ్మ, జనసేన రాయలసీమ ఎన్నికల కన్వీనర్ పవన్ పాల్గొన్నారు.

వైసీపీ వస్తే బానిస బతుకులే.. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే బానిస బతుకులు తప్పని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. గురువారం నగరంలోని 5 వార్డు చిత్తారి వీధిలో పలువురు యువకులు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో పెద్దకుమార్, విజయ్, రాజు ఉన్నారు.

వాహనాల తనిఖీ

సి.బెళగల్, మార్చి 21: మండల కేంద్రంలోని సి.బెళగల్‌లో బుధవారం ఎస్ఐ తిమ్మారెడ్డి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కారులు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో అధికమొత్తం డబ్బులను పెట్టుకుని ప్రయాణం చేసిన వారు పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే తగిన ఆధారాలు చూపాలన్నారు. హెడ్ కానిస్టేబుల్, పోలీసులు ఉన్నారు.

పాఠశాలలకు భద్రత కల్పించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 21: ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి సెలవుల్లో ఆకతాయిల వికృత చేష్టలు మితిమీరిపోతున్నాయని, వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకుని పాఠశాలలకు భద్రత కల్పించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ మహిళా ఐక్యవేధిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏవో వాసుదేవరకు ఆమె వినతిపత్రం అందజేశారు.

అధికార పార్టీ కార్యక్రమాల్లో అప్కాస్ కార్మికుడు


ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వెనుక నిలబడిన వ్యక్తి రమేష్

కర్నూలు(న్యూసిటీ), మార్చి 21: నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటో డివిజన్‌లో ఏపీ39టీయూ 6396 ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న అప్కాస్ కార్మికుడు రమేష్ అధికార పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల నిబంధ నల ప్రకారం ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టు, అప్కాస్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎవ్వరు కూడా రాజకీయ పార్టీ నాయకులతో సత్సంబంధాలు పెట్టుకోరాదు. అయితే రమేష్ ఏకంగా ప్రస్తుత ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ నివాసంలో కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జి ఏఎన్ఎండీ ఇంతియాజ్ మంతనాలు చేస్తుండగా వారి సేవలో తరిస్తున్నాడు.

నిబంధనల అమలు ఇలాగేనా?


ముసుగు వేయకుండా వదిలేసిన శిలాఫలకం

కర్నూలు(న్యూసిటీ), మార్చి 21: నగరంలో ఇటీవల వివిధ అభివృద్ధి పనులకు వైసీపీ నాయకులు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఇదంతా ఎన్నికల షెడ్యూల్ రాకముందే హడావుడిగా కానించారు. అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు కింద ఎక్కడ కూడ ఓటర్లను ప్రభావితం చేసే విధంగా ఏ రాజకీయ పార్టీలకు సంబంధించి ఫెక్సీలు, బ్యానర్లు, నాయకులు పేర్లు కనబడకూడదు. అయితే నగరంలోని సంకల్‌బాగ్, ఖండేరి, కుమ్మరిగేరి తదితర ప్రాంతాలలో గతంలో ఆవిష్కరించిన శిలాఫలకాలకు ముసుగులు కూడా వేయకపోవడం విడ్డూరంగా ఉంది.

స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

కర్నూలు(న్యూసిటీ), మార్చి 21: నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఈవీఎంలను భద్రపరిచేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) భార్గవతేజ తనిఖీ చేశారు. గురువారం స్టేడియంలో ఈవీఎం ర్యాక్స్, రూమ్‌ను పరిశీలించారు.

నగరాభివృద్ధికి సహకరించండి

గూడూరు, మార్చి 21: ఇంటి, నీటి, దుకాణాల పన్నులు చెల్లించి ప్రజలు నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ దివాకర్ రెడ్డి కోరారు. గురువారం కమిషనర్ ఆదేశాల మేరకు ఏఈ నరసింహలు పర్యవేక్షణలో నగర పంచాయతీ సిబ్బంది గూడూరులోని ఆయా కాలనీల్లో ఇంటింటికి వెళ్ళి పన్ను వసూలు చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, మార్చి 21: మండలంలోని చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి, సంగాల గ్రామాల్లో తాగునీటి సమస్య తెలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసెనాయక్ సర్పంచులకు ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో సర్పంచులతో సమావేశం నిర్వహించారు.

మంత్రి పెద్దిరెడ్డి క్షమాపణ చెప్పాలి

» లేదంటే బస్సు యాత్రను అడ్డుకుంటాం
» విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కర్నూలు(అర్బన్), మార్చి 21: చంద్రబాబును రాజకీయ వికలాంగుడని విమర్శించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెంటనే దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో బస్సుయాత్రను అడ్డుకుంటామని విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఎల్లప్ప అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం విశ్వేరయ్య సర్కిల్‌లో మంత్రి పెద్దిరెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును రాజకీయ వికలాంగుడని సంబోధించడం పెద్దరెడ్డి రామచంద్రారెడ్డికి తగదన్నారు. జగన్‌రెడ్డి కోడికత్తి దాడి చేయించుకోని చేతికి కట్టు కట్టించుకొని దివ్యాంగుల సానుభూతితో సంకల్ప యాత్రలో ప్రతి రోజు ఒక దివ్యాంగుడిని కలిసి ఆ ఫొటోలకు ఫోజులిచ్చి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. పెద్దిరెడ్డిపై 2016 చట్టం 92 సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దరూర్ జేమ్స్, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు కొమ్మురి మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి మక్బూల్ బాషా, మహిళా విభాగం అధ్యక్షురాలు మాదవేని మద్దమ్మ, భగవంతుడు వెంకటేశ్వర్లు, శ్రీరాములు పాల్గొన్నారు.


పెద్దిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దివ్యాంగులు

మద్యం పట్టివేత

కోడుమూరు (రూరల్), మార్చి 21: కోడుమూరు సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి మద్యం, నాటుసారాను పట్టుకున్నారు. ఈసందర్భంగా సెబ్ సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని వెల్దుర్తిలో రామచంద్రుడు అనే వ్యక్తి వద్ద 6 లీటర్లు, లక్ష్మీదేవి అనే మహిళ నుంచి 7 లీటర్ల నాటుసారా సీజ్ చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. అలాగే లద్దగిరి గ్రామంలో ఈశ్వరయ్య అనే వ్యక్తి వద్ద 11 మద్యం బాటిళ్లు, బైక్, కోయిలకొండకు చెందిన యోగీశ్వరయ్య అనే వద్ద 40 కర్ణాటక మద్యం టెట్రి ప్యాకెట్లు సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఈదాడుల్లో టాక్స్‌ఫోర్స్ సీఐ నరసా నాయుడు ఎస్ఐలు అలీబేగ్, వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి

కోడుమూరు(రూరల్), మార్చి 21: ఎండలు తీవ్రంగా ఉన్నందువల్ల వడదెబ్బ తగలకుండా ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీవో మోదీన్‌సాహెబ్ సూచించారు. గురువారం క్రిష్ణాపురం రహదారిలో కాలువ పూడికతీత పను లను ఆయన పరిశీలించి, కూలీల హాజరును మస్టర్‌లో తనిఖీ చేశారు. ఏపీవో మోదీన్‌సాహెబ్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా ఉదయానే పనులకు చేరుకోవాని, వెంట తాగునీరు తప్పనిసరిగా ఉంచుకోవాలని అన్నారు. కొలతల మేర పనులు చేసి రూ.272 పొందాలని సూచించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ మధు ఉన్నారు.

ఘనంగా పప్పూరి వర్ధంతి

కర్నూలు(అర్బన్), మార్చి 21: శ్రీబాగ్ ఒప్పంద సృష్టికర్త పప్పూరి రామాచార్యులు 52వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం రాయల సీమ విద్యార్థి సమాఖ్య కార్యాలయంలో పప్పూరి రామాచార్యులు చిత్రపటానికి ఆర్‌వీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీమకృష్ణ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ 1926 ఆగస్టు 14న శ్రీసాధన ప్రతిక స్థాపించారు. శ్రీబాగ్ ఒప్పందం ఏర్పడడానికి ప్రధాన కారకులు ఆయన నేన్నారు. కార్యక్రమంలో భూషణ్, గణేష్, ఉదయ్, షేక్షా, దస్తగిరి పాల్గొన్నారు

నగర మహిళా అధ్యక్షురాలిగా రాధమ్మ



రాధమ్మకు నియామక పత్రం అందజేస్తున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 21: జిల్లా రజక సాధికార కమిటీ ఆధ్వర్యంలో టీడీపీ నగర మహిళా అధ్యక్షురాలిగా బాపనపల్లి రాధమ్మను నియమించారు. గురువారం స్థానిక మౌర్యఇన్‌లో బాపనపల్లి రాధమ్మకు టీజీ భరత్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో రజక మహిళల సాధికారత కోసం అహర్నిశలు కృషి చేస్తానన్నారు. టీజీ భరత్ మాట్లాడుతూ రజకుల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రజక సాధికార కమిటీ సభ్యుడు సీపీ వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు మాలింగిరి గణేష్, రాయలసీమ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్ లింగమయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు


అవార్డు అందుకుంటున్న బీ క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 21: మక్స్ గ్లోబల్ ఫౌండేషన్ హైదరాబాదు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్త సేవా పురస్కార అవార్డును కర్నూలు బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ అందుకున్నారు. విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గానూ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఉత్తమ సేవా పురస్కార్-2024 అవార్డును హైదరాబాదులోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో నాగస్వామి నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్‌ను అభినందించారు.

● **రాణి రుద్రమదేవి ఉత్తమ సేవా అవార్డు:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ ఉత్తమ మహిళా సేవా పుర స్కార్ అవార్డును సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ పోలూరు పావని అందుకున్నారు. ఆంగ్ల రచయితగా ఇంగ్లీషు లిటరేచర్‌లో వేర్వేరు కవి తలు రాసినందుకు గానూ మక్స్ గ్లోబల్ ఫౌండేషన్ హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రస్మితాకూర్-మిస్ ఆసియా ఇంటర్నేషనల్ మిస్ ద ప్లానెట్ డా.ధన సరి సీతక్క, తెలంగాణ రాష్ట్ర పంచాయితీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

ఫిలిం, టీవీ, థియేటర్ రంగాల్లో శిక్షణ

కర్నూలు(కల్చరల్), మార్చి 21: నగరంలోని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఫిలిం, టీవీ, థియేటర్ రంగాల్లో ఆసక్తి ఉన్న యువతీ యువకులకు శిక్షణలు ఇస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, శిక్షణ నిర్వాహకుడు జల్లు కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న సాయంత్రం 4 గంటల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వారు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, 15 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు వయసు కలిగిన వారు ఈ శిక్షణలకు అర్హులని తెలిపారు. నటన పట్ల ఆసక్తిగలవారై, తెలుగులో చక్కగా మాట్లాడ గలిగిన వారై ఉండాలన్నారు. ఎంపికైన యువతీ యువకులకు ఏప్రిల్ 4 నుంచి మే 30 వరకు శిక్షణ ఇస్తామని, ప్రారంభ, ముగింపు సమావేశాలకు ప్రముఖ సినీ, జబర్దస్త్ కళాకారులు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. అలాగే శిక్షణ పొం దిన యువ కళాకారులు ఒక సాంఘిక నాటకం, ఒక టెలీఫిలిం ప్రదర్శిస్తారని వారు పేర్కొన్నారు.

ఒకే రోజు రెండు యూనిట్ల ఓపీ

కర్నూలు(హాస్పిటల్), మార్చి 21: రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో నిత్యం రద్దీగా ఉండే మెడిసిన్, గైనిక్, పీడియాట్రిక్‌లలో అత్యధిక ఓపీ రోగులు వస్తున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒకేరోజు రెండు యూనిట్లకు వైద్యులు ఓపీ చూసే విధానంపై డీఎంఈ సలహా కోరారు. ఇటీవల జరిగిన జూమ్ మీటింగులో మెడిసిన్, గైనిక్, పీడీ యాట్రిక్ విభాగాల్లో ఒకేరోజు రెండు యూనిట్లు నిర్వహిస్తే ఎలా ఉంటుందో సలహాలు ఇవ్వాలని డీఎంఈ కోరారు. ఈ విధానం అమల్లోకి వస్తే రోగులు గంటల తరబడి క్యూలైన్లలో పడిగాపులతో వేచి చూడాల్సిన అవసరం ఉండదని కర్నూలు జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయాలి: సీపీఐ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 21: వైసీపీ కోసం పని చేస్తున్న కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండల ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని కోరుతూ గురువారం కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య ఎన్నికల కంట్రోల్ రూమ్ సూపరింటెండెంట్ శివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిష్ణగిరి మండలం సీహెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన చాకలి నరసింహుడుపై ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి అక్రమ కేసు పెట్టారని అన్నారు. ఈ నెల 17వ తేదీ చాకలి నరసింహుడుని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సీహెచ్ ఎర్రగుడి గ్రామంలో సీపీఐ పార్టీలో ఉండకుండా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సహాయ సహకారాలు అందించాలని ఎస్ఐ వేధించారని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ఎస్ఐ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నార వినతి పత్రం ఇచ్చిన వారిలో నాగరాజు, రవిమోహన్, రామాంజనేయులు, పరమేశ్వరరెడ్డి, సుంకన్న, కారన్న ఉన్నారు.


వినతి పత్రం ఇస్తున్న పి.రామచంద్రయ్య

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు
● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

సెయింట్‌జాన్స్‌లో క్యాంపస్ నియామకాలు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 21: ఎర్రకోట సెయింట్ జాన్స్ కళాశాలలో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో క్యాంపస్ నియామకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఈరన్న మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన టీపీపీ అకాడమి సంస్థ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఈసీఈ, సీఎస్ఈ, ఎంఈసీ గ్రూపుకు చెందిన 10మంది విద్యార్థులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఎంపిక చేశారన్నారు. వీరికి టీపీపీ సంస్థ ఏడాదికి రూ.4.5 లక్షల నుంచి రూ.5లక్షల వరకు వేతనం కల్పించారని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సిబ్బంది అభినందించారు.

సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 21: ఎన్నికల సమయంలో సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్వో చిరంజీవి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో సమావేశమయ్యారు. తహసీల్దార్ శేషారెడ్డితో పాటు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంపీడీవో కొండన హాజరయ్యారు. సెక్టోరియల్ అధికారులు ఎన్నికల సమయంలో బూత్‌లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవీఎం మిషన్ల వినియోగంపై చర్చించారు. అనంతరం ఈవీఎం మిషన్ల వాడకాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.

పశువుల మార్కెట్‌ను వదలని వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 21: తమ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని చెప్పుకుంటున్న అధికార పార్టీ నాయకులు రైతులను కూడా వదలడంలేదు. ప్రతి ఆదివారం రైతులు పశువులను విక్రయించేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడికి ఆంధ్రా, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సైతం రైతులు తమ పశువులను విక్రయించేందుకు వస్తుంటారు. అయితే అధికార పార్టీ నాయకులు రైతుల నుంచి జకాతి రూపంలో అధిక వసూళ్లకు పాల్పడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఇదేమని అడిగితే రైతులపైనే దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత బహిరంగ దోపిడీ చేస్తున్నా అధికారులు మాత్రం ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. అధికారులతో అధికార పార్టీ నాయకులు కుమ్మక్కు కావడంతోనే రైతులు దోపిడీకి గురవుతున్నారన్నారు. నాయకులు భాస్కర్‌యాదవ్, సమీఉల్లా, మల్లికార్జునగౌడు, ఖాజా, సుంకన్న, రవి, కృష్ణ, రామాంజి, అజార్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కౌతాళం, మార్చి 21: ఉరుకుంద గ్రామంలోని ఈరన్న స్వామి దేవాలయం వద్ద స్వామి దర్శనానికి వ చ్చే భక్తులకు తాగునీటిని అందించేందుకు గురువారం ఆలయ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ చ లివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలం కావడంతో తాగునీటి కోసం అవస్థలు పడకుండా ఆలయ ఉత్తర ద్వారం వద్ద చలివేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే శాశ్వత అన్నదాన కార్యాలయం వద్ద భక్తుల సౌకర్యార్థం పత్తికొండకు చెందిన స్వామి వారి భక్తులు బీ ఈ మాణిక్యాంబ, బీ ఈ కవిత రూ.50వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను విరాళంగా అందించినట్లు తెలిపారు.

అకౌంటుకు ఆధార్, ఈకేవైసీ తప్పనిసరి

తుగ్గలి, మార్చి 21: సహకార సంఘంలో ఖాతా ఉన్న ప్రతి రైతు వారి అకౌంటుకు ఆధార్‌తో ఈకేవైసీ అనుసంధానం చేసుకోవాలని ఉప్పర్లపల్లి సొసైటీ సీఈవో గిడ్డయ్య తెలిపారు. గురువారం జొన్నగిరిలో సహకార సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అకౌంటు ఉన్న ప్రతి రైతు ఖాతాదారుడు వారి అకౌంటులో రూ.300 ఉండేలా చూసుకోవాలని, లేకపోతే వారి సభ్యత్వం రద్దువుతుందని హెచ్చరించారు.

పెద్దకడుబూరు పీహెచ్‌సీలో అధికార బ్యానర్లు

పెద్దకడుబూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కోడ్ నిబంధనలు పాటించడంలేదు. అధికార పార్టీకి చెందిన సంక్షేమ పథకాల బ్యానర్లతో పాటు ఆస్పత్రి లోపలి భాగంలో కూడా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసే బ్యానర్లను అధికారులు అలాగే వదిలేయడంతో పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

నిర్భయంగా ఓటు వేయండి

తుగ్గలి, మార్చి 21: ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం తుగ్గలి, జొన్నగిరి, రాతన తదితర గ్రామాల్లో తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు మల్లికార్జున, రామాంజనేయులు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. అలాగే ఓటు హక్కు వినియోగం పై ఎన్నికల కోడ్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల షెడ్యూల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి గ్రామంలో పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

మీ ఓటు మీ ఇష్టం : కలెక్టర్

● సమస్యాత్మక ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటన

మంత్రాలయం, మార్చి 21: మీ ఓటు మీ ఇష్టమని, ఇష్టమైన వారికి శాంతియుత వాతావరణంలో వేసుకోవచ్చని ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన అన్నారు. మండలంలోని అత్యంత సమస్యాత్మక కేంద్రమైన రచ్చుమర్రి గ్రామంలోని 57, 58 పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్ అకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం గ్రామానికి వెళ్లి పోలింగ్ కేంద్రాల్లోని అన్ని ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓటర్లతో వారు మాట్లాడారు. ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఏదైనా సమస్యలుంటే తెలియజేయాలని గ్రామస్థులను సూచించారు. ఎన్నికల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అధికారులకు సహకరించాలన్నారు. వీరి వెంట మంత్రాలయం ఆర్వో మురళి, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, డీటీ రాఘవేంద్ర, సరస్వతి, ఆర్ఐ ఆదామ్, మహేష్, ఆనంద్, నరసప్ప, కోసిగి సీఐ ప్రసాద్, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తిలు ఉన్నారు.

వాల్మీకి నగర్‌లో గ్రామస్థులకు అవగాహన

ఆదోని : ఆదోని మండల కేంద్రం వాల్మీకి నగర్‌లోని జీ విశ్వేశ్వర పాఠశాల కపటి గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్ర ఆవరణలో ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టర్ డాక్టర్ జీ సృజన గ్రామసభ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు మన పిల్లల మంచి భవిష్యత్తు కోసం మనం నిర్వహిస్తున్నప్పుడు మంచి వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని పేర్కొన్నారు. ఎలాంటి గొడవలు పడకుండా మీ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఎస్పీ


రచ్చుమర్రి గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

శివనారాయణ స్వామి, తహసీల్దార్ హసీనా సుల్తానా పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వాహణపై అవగాహన సదస్సు

పట్టణంలోని రెడ్డీస్ హాస్టల్లో సాధారణ ఎన్నికలు 2024 నిర్వాహణ పై బూత్ లెవెల్ స్థాయి అధికారులకు, సెక్టోరియల్ అధికారులకు, ఎంసీసీ బృందాలకు కలెక్టర్ డాక్టర్ జీ సృజన, ఎస్పీ జీ కృష్ణకాంత్ అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు చేపట్టాల్సిన విధి, విధానాల పై వారు సూచనలు చేశారు. ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా తావివ్వకూడదని సూచించారు.

కపటిలో ఎస్పీ, కలెక్టర్ పర్యటన

ఆదోని రూరల్ : ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా ఆదోని మండలంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జి. ఎస్పీ కృష్ణకాంత్ సూడిగాలి పర్యటన చేశారు. రూరల్ పరిధిలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన కపటిలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. మీకు ఇష్టమైన వారికి ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని, అల్లర్లకు పాల్పడినా, సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఐదేళ్లలో వైసీపీ చేసింది శూన్యం

● బీవీ సమక్షంలో నాగలదిన్నె వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక


బీవీ సమక్షంలో టీడీపీలో చేరుతున్న నాగలదిన్నె వైసీపీ నాయకులు

ఎమ్మిగనూరు, మార్చి 21: ఈ ఐదేళ్లలో వైసీపీ, సీఎం జగన్ ప్రజలకు చేసింది శూన్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 5వ వార్డులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి ఓటు అభ్యర్థించారు. అభివృద్ధి సంక్షేమం ఒక్క తెలుగుదేశంతో మాత్రమే సాధ్యమన్నారు. ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకొని మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, కౌన్సిలర్లు దయాసాగర్, రామదాసు గౌడ్, నాయకులు కొండయ్య చౌదరి, సుందరరాజు, షాబీర్, ముల్లా కలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక : నందవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. టీబీపీ కాలనీలోని బీవీ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాగలదిన్నెకు చెందిన వైసీపీ నాయకులు వడ్డే శ్రీనివాసులు, బలిజ శేఖర్, దాసరి నరసింహులు, వడ్డే భీమన్న, వడ్డే బాలరాజు, వడ్డే రంగస్వామి, వడ్డే ఎల్లప్ప, వడ్డె వీరేష్‌తో పాటు మరో వంద మంది టీడీపీలో చేరారు. వీరిని బీవీ పార్టీ కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. నందవరం మండల నాయకులు మగతి ఈరన్న గౌడ్, మాధవరావు దేశాయ్, కాశీం వలి, రైస్‌మిల్లు నారాయణ రెడ్డి, ఈరన్న, జబ్బార్, దేశాయ్ గురురాజు, గోపాల్, జగదీష్ పాల్గొన్నారు.

టీడీపీ జెండా ఎగురవేస్తాం

● ప్రచారం ప్రారంభించిన మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి


కోసిగిలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మార్చి 21: త్వరలో జరగబోయే ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి అన్నారు. గురువారం మంత్రాలయం రాఘవేంద్రస్వామిని, మంచాలమ్మను, మాధవరంలో గ్రామదేవత దేవమ్మను, అంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముందుగా కురువ వీధిలో 9 ఇళ్లకు తిరిగి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, బీసీ డిక్లరేషన్ వంటి పథకాలు ఎంతగానో ఉపయోగపడుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కురువ ఈరన్న, హుశేన్ ఆలం, కౌలుట్లయ్య, భీమిరెడ్డి, రామయ్య, శివ, వీరేష్, పాల్గొన్నారు.

కోసిగి : టీడీపీ మండల నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, చింతలగేని నర్సారెడ్డి ఆధ్వర్యంలో తేరుబజారు మైదానం నుంచి వాల్మీకి సర్కిల్ వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వాల్మీకి మహర్షి విగ్రహానికి టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి మాధవరం రాఘవేంద్రరెడ్డి పూలమాలలు వేసి పూజలు చేశారు. అలాగే రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉలిగయ్య ముత్తురెడ్డి, సురేష్ నాయుడు, రామిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణ, రాజేంద్రనాయుడు, సిద్దప్ప, రాకేష్ రెడ్డి, అరివిలి వీరేష్, సొట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళితులంతా తిక్కారెడ్డి వెంటే ..

మంత్రాలయం, మార్చి 21: నియోజకవర్గంలోని దళితులంతా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి వెంటే ఉన్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి విజయకుమార్, కోసిగి ఎంపీటీసీ రాజు, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు సోల్మాన్‌రాజు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి యేబు, సుజ్ఞానం అన్నారు. గురువారం మంత్రాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఆయా గ్రామాల దళితులు ర్యాలీగా వచ్చి అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. టీడీపీ టికెట్ తిక్కారెడ్డికే ఇవ్వాలని తీర్మానించారు. దళితులను కుటుంబ సభ్యులుగా చూసుకునే తిక్కారెడ్డికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని అన్నారు. టీడీపీ అదిష్టానం పునరాలోచన చేయాలని కోరారు. టీడీపీ నాయకులు అశోక్ రెడ్డి, క్రిష్ణమోహన్ రెడ్డి, విజయరామిరెడ్డి, రాజబాబు, దేవన్న, సురేంద్ర, జనసేన నాయకులు యేసేబు, లింగమూర్తి, వీరేష్, రాము, సుజ్ఞానం, దేవదాసు, ఆదామ్, యోహాన్, ఇజ్రాయేల్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఆత్మీయ సమ్మేళనం

కౌతాళంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప స్వగృహంలో కుంటనహల్, తోవి, బదినేహల్ గ్రామాల నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని వారికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిక్కారెడ్డి భరోసా ఇచ్చారు.

బాలిక మృతదేహం వద్ద ఉద్రిక్తత


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న బాలిక కుటుంబ సభ్యులు

మంత్రాలయం, మార్చి 21: బాలిక మృతికి కారకుడైన వ్యక్తిని అరెస్టు చేసేంత వరకు అంత్యక్రియలు చేసేది లేదని బాలిక కుటుంబ సభ్యులు భీష్మించారు. మండలంలోని చెట్నహళ్లి గ్రామానికి చెందిన ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం చేసుకోగా.. మైనర్ బాలిక కర్నూలు ఆసుపత్రిలో కోలుకోలేక మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ కర్నూలు ఆసుపత్రిలో బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. బాలిక మృతికి కారణమైన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న మంత్రాలయం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని బాలిక మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేశామని, నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, కోలుకోగానే అరెస్టు చేసి శిక్షిస్తామని హామీ ఇచ్చినప్పటికీ బాలిక బంధువులు శాంతించలేదు. దీంతో కొద్దిసేపు పోలీసులు, బంధువుల మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు పోలీసులు పెద్దల సమక్షంలో నిందితుడిని కోలుకున్న వెంటనే అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ చేస్తామని గట్టి హామీ ఇచ్చి శాంతింపజేశారు. అనంతరం బాలిక మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, మార్చి 21 : రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్యపూజలకు విరామం కల్పించారు. గురువారం ఏకాద శి సందర్భంగా బృందావనంకు నిత్యం జరిగే పూజలు బంద్ చేశారు. మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తప్త ముద్రధారణ చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు : రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు వేసవి కాలం దృష్ట్యా మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. మధ్వమార్గ్ కారిడార్‌లో ఎండాకాలంలో వచ్చే భక్తులకు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చలువ పందిళ్లు, కూల్ పెయింట్ వంటి పనులు సాగుతున్నాయి. తాగునీరు సౌకర్యం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అన్నపూర్ణ భోజనశాల, పూర్వపీఠాధిపతుల బృంధావనల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికతతోనే మనసు ప్రశాంతత : ఆధ్యాత్మిక చింతనతోనే ప్రజల మనస్సు ప్రశాంతంగా ఉంటుందని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అన్నారు. గురువారం గురుసార్వభౌమ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రవచనా మండపంలో బెంగుళూరు చెందిన జగదీష్ కుమార్, మోహన్‌దాస్, నిత్యానంద, మధుగిరి, మహదేవ్, ప్రసాద్‌లచే నిర్వహించిన హరికథామృతం ప్రారంభించారు.

జింక పిల్ల అప్పగింత

మద్దికెర, మార్చి 21: మద్దికెర గ్రామానికి చెందిన కవిరెడ్డి క్రిష్ణ, కవిరెడ్డి గోపాల్ వ్యవసాయ పొలాల్లో దొరికిన జింక పిల్లను ఏఎస్ఐ చెన్నయ్యకు గురువారం అప్పగించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నల్లరేగడి పొలాలు ఉంటాయి. జింకలు ఎక్కువగా సంచరిస్తుంటాయి. వేసవి కాలం కావడంతో వ్యవసాయ పొలాల్లో నీరు లేకపోవడంతో గ్రామ శివారులో నీరు తాగేందుకు వస్తుంటాయి. అలా వచ్చిన జింకను కుక్కలు తరుముతుండగా.. ఆ జింక పిల్లను కుక్కల బారి నుంచి కాపాడి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా.. పోలీసులు ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

మార్కెట్ సముదాయానికి రూ.3 లక్షల విరాళం


నాబార్డు వారికి రూ.3లక్షల చెక్కు అందజేస్తున్న కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి

మద్దికెర, మార్చి 21: మండల కేంద్రంలో మార్కెట్ సముదాయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన మాజీ సర్పంచు కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి నాబార్డు వారికి రూ.3లక్షలు విరాళంగా అందజేశారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో తన తండ్రి దివంగత మాజీ సర్పంచు కొత్తపేట సుదర్శన్ రెడ్డి జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని నవయూత్ అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, లక్ష్మీనారాయణకు అందజేశారు. కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికి వారపు సంతలు జరుగుతుంటాయని, మెయిన్‌రోడ్డులో రోడ్డుకిరువైపులా వ్యాపారాలు చేసుకొనే చిరు వ్యాపారులు, ప్రజలు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతుంటారన్నారు. ఈ విషయంపై నాబార్డువారిని ఆశ్రయించగా.. తమ కంట్రిబ్యూషన్ కింద రూ.3లక్షలు చెల్లిస్తే.. మీగతావి నాబార్డు భరిస్తుందని చెప్పారని పేర్కొన్నారు. తమ కాంట్రిబ్యూషన్ కింద రూ.3 లక్షలు ఇచ్చామని వివరించారు. నవయూత్ అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు మాట్లాడుతూ కొత్తపేట కుటుంబీకులు గ్రామంలో జడ్పీ పాఠశాలలకు స్థలాలతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూడా స్థలం ఇచ్చారని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు డి.మురళీధర్ రెడ్డి, విజ్జిరెడ్డి, మాజీ ఉప సర్పంచు నాగేశ్వరరెడ్డి, పంచాయతీ సలహాదారులు బండారు అంజనేయులు, తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడు తదితరులు ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఆర్పీ

ఎమ్మిగనూరు, మార్చి 21: ప్రభుత్వానికి సంబంధించిన వారు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని ఎన్నికల సంఘం పదే పదే హెచ్చరిస్తున్నా కొందరు వినిపించుకోవటం లేదు. ఎన్నికల సంఘం అధికారుల ఆదేశాలను బేఖతారు చేస్తు రాజకీయ పార్టీల అభ్యర్థులతో అంటకాగుతూ ప్రచారంలో పాల్గొంటున్నారు. తాజా గురువారం ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక పట్టణంలోని 18వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ ప్రచారంలో ఆ వార్డుకు చెందిన మెప్మాడిపార్ట్ మెంటుకు చెందిన టీఎల్ఎఫ్ సెక్రటరీ, ఆర్పీ బి శివగంగా బుట్టా రేణుకతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కనిపించింది. కొంతమంది ఫొటో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తన దృష్టికి వచ్చిందని, ఆమెను విధులనుంచి తొలగిస్తున్నామని పేర్కొన్నారు.

రమణీయం ఉచ్చీరప్ప తాత రథోత్సవం

ఆలూరు, మార్చి 21 : మండల పరిధిలోని పెద్దహోతూరు గ్రామంలో వెలసిన ఉచ్చీరప్ప తాత, శ్రీ చలువప్ప తాతల రథోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. గురువారం ఉదయం ఉచ్చీరప్ప తాత దేవాలయంలో ప్రత్యేక పూజలను అర్చకులు సిద్ధయ్యస్వామి, చంద్రమౌళి నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మరకట్టు గ్రామంలో చలువప్ప తాతను పల్లకీలో ఊరేగింపుగా పెద్దహోతూరు ఉచ్చీరప్ప తాత దేవాలయానికి చేరుకున్నారు. రాత్రి 7 గంటలకు భక్తుల నడుమ చలువప్ప తాత, ఉచ్చీరప్ప తాతల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎన్నికల విధులకు మినహాయింపు ఇవ్వాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల్లో దీర్ఘకాలిక వ్యాధులు కలిగిన ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు నాగరాజు కోరారు. గురువారం డిప్యూటీ ఈవో వెంకటరమణ రెడ్డిని కలిసి ఎస్టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. కాన్సర్, గుండెజబ్బులు, ఊపిరితిత్తులు, మానసిక సమస్యలతో అంగవైకల్యం కలిగిన వారికి, 60 ఏళ్ల పైబడిన వారికి, చంటి పిల్లలు కలిగిన మహిళా ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, భీమరాజు, వెంకటరామి రెడ్డి, శ్రీరాములు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆలూరు, మార్చి 21 : మండల కేంద్రంలో తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు నారాయణ స్వామి కోరారు. గురువారం స్థానిక గ్రామ పంచాయితీలో ఈవోపీఆర్డీ ప్రకాష్ నాయుడును కలిసిన వినతిపత్రం అందించారు. ఆలూరు మండల కేంద్రంలో ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో గత ఏడాది గుంతకల్లు రోడ్డులోని చెక్‌పోస్టు, బస్టాండ్, ఎల్లార్తి రోడ్డులో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రయాణికుల, ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షాకీర్, కృష్ణ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనలు

పెద్దకడుబూరు, మార్చి 21: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి ఆరు రోజులు అయినా అధికారులు మాత్రం కోడ్ నిబంధనలను పాటించడంలేదు. కలెక్టర్ నుంచి స్థానిక అధికారుల వరకు అందరు కోడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఇందులో భాగంగానే ఏ పార్టీకి చెందిన బ్యానర్లైనా, పార్టీలకు సంబంధించిన ఫొటోలను ఎక్కడ ఉన్నా తొలగించాల్సి ఉంది. పెద్దకడుబూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోడ్ నిబంధనలు పాటించడంలేదు. అధికార పార్టీకి చెందిన సంక్షేమ పథకాల బ్యానర్లతో పాటు ఆస్పత్రి లోపలి భాగంలో కూడా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేసే బ్యానర్లను అధికారులు అలాగే వదిలేయడంతో పలువురు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వెల్దుర్తి, మార్చి, 21 : ఎన్నికల కోడ్ వచ్చి ఆరు రోజులవుతున్నా బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయ భవనాల్లో వైసీపీ రంగులు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో వైసీపీ రంగులతో మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, గుంటుపల్లె గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైసీపీ రంగులతో జెండా దిమ్మెలు ఎన్నికల కోడ్‌తో తమకు సంబంధం లేదన్నట్టుగా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ కార్యాలయం రంగులు తొలగించకుండా ఉండడం, వైసీపీ జెండా దిమ్మెలు తొలగించకుండా ఉండడాన్ని తప్పుపడుతున్నారు. మండలంలో వలంటీర్లు వాట్సాప్ గ్రూపులలో అధికార పార్టీకి అనుకూలంగా పోస్టింగ్‌లు పెడుతున్నారని పలువురు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త సమాచారం

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హొళగుంద, మార్చి 21 : మలేరియా వంటి వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మలేరియా కర్నూలు జిల్లా అధికారి నూకరాజు అన్నారు. గురువారం హొళగుంద, గజ్జెహళ్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి పలు వివరాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మంజునాథ్, డాక్టర్‌లు న్యూటన్, బిందు, మాధవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జేబుదొంగల అరెస్ట్

ఆదోని, మార్చి 21 : పట్టణంలోని వెంకటేశ్వర టీ స్టాల్ దగ్గర ఇద్దరు జేబుదొంగలను గుర్తించి అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ గోపీనాథ్ తెలిపారు. గురువారం వెంకటేశ్వర టీ స్టాల్ దగ్గర తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన అమాస శ్రీను, మునిరాజలను అదుపులోకి తీసుకొని విచారించగా, వారి దగ్గర నుంచి రూ.38 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రెండు రోజులుగా ఆదోని పట్టణంలో తిరుగుతూ జేబు దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. దొంగతనాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు తెలిపారు.

హోలీ ఉత్సవాలు ప్రారంభం

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 21 : పట్టణంలోని కల్పినపేట అంబాభవాని దేవాలయంలో హోలీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి ఈ నెల 19న మన్మథ రతిదేవీల విగ్రహాలతో పాటు శివ పార్వతి విగ్రహమూర్తులను కూర్చోబెట్టారు. ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు, ఆలయంలో భజనలు నిర్వహిస్తారు. ఈ నెల 23న రాత్రి రథోత్సవం పై మన్మథ స్వాములను సాంప్రదాయబద్ధంగా, వాయిద్యాలతో పురవీధుల్లో ఊరేగింపు చేస్తారు.

రాజ్యాధికారం కోసం పోరాడాలి

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 21 : దళిత బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాడాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరి నాయుడు అన్నారు. గురువారం స్థానిక బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు రాజ్యాధికారం, రాయలసీమ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగానే తమను ఉపయోగించుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు తమకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ నాయకుడు పగడాల కోదండ, నాయకులు గజ్జల ప్రభాకర్, పోతన్న, బీసీ పెడరేషన్ నాయకులు సాయిబాబా, శేక్షావలి పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి

ఆలూరు, మార్చి 21 : ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాము నాయక్ అన్నారు. గురువారం ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వాహణపై సెక్టోరియల్ పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. మోడల్ కోడ్‌ను నిష్పక్షపాతంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్‌లు రజనీకాంత్ రెడ్డి, గుండాల నాయక్, ఆర్ఐ బసన్న గౌడ్ పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి నాంది

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 21 : ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి నాంది అని మెప్మా పీడీ శివలీల అన్నారు. గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మెప్మా స్వీప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీ ఓటు నీ భాధ్యత పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అనేది కత్తి కన్నా పదునైనది, అందుకే దాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించిందన్నారు. సరైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని అన్నారు.